

# హైదరాబాద్ వార్త

# బడినే కాదు.. బస్సునూ చూడండి



**-పిల్లల భద్రత అత్యంత ప్రధానం**
**-తల్లిదండ్రులూ తమ బాధ్యత మరవద్దు**
**-రేపటి నుంచి పాఠశాలలు పున:ప్రారంభం**

**హైదరాబాద్,జూన్ 13,ప్రభాతవార్త:** నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైంది. తల్లి దండ్రులు తమ పిల్లలు మంచి విద్యా ప్రమాణాలు ఉన్న పాఠశాలల్లో చేర్పించాలని చూస్తారు. అదే సమయంలో సరైన రవాణా వసతి ఉందా లేదా తెలుసుకోవాలి. విద్యార్థులను క్షేమంగా ఇంటికి చేర్చే విద్యాసంస్థల బస్సు ప్రమాణాలు, అనుభవజ్ఞులైన డ్రైవర్లు ,నిర్వాహణపై దృష్టిసారించాలి.

**మెట్లు ..**ఎక్కే తొలిమెట్టు విద్యార్థులకు అనువుగా 325 ఎంఎం ఎత్తులో ఉండాలి. లేకుంటే వారికి అనువుగా తాత్కాలిక బల్ల ఏర్పాటు చేయాలి. లేదా అటెండర్ విద్యార్థులను విధిగా బస్సుల్లోకి ఎక్కించడం, దించడం చేయాలి. చేతితోపట్టుకుని సులువుగా ఎక్కేందుకు, దిగేందుకు రేలింగ్ రాడ్లు ఉండాలి.

**అద్దాలు :** లోపలి భాగంలో డ్రైవర్‌కు ఇరుపక్కలా బయటి భాగంలో అద్దాలను అమర్చాలి. ప్రయాణ సమయంలో ప్రతి క్షణం విద్యార్థులు, ఇరుపక్కలా వస్తున్న వాహనాల తీరునూ డ్రైవర్ ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి.

**వాహనం కండిషన్ :** హెడ్‌లైట్లు ,వైపర్ ,విద్యార్థులు కూర్చునేందుకు అనువుగా సీట్లు ఉన్నాయా లేవా చూసుకోవాలి.

**టిఎస్ స్కూల్ బస్‌యాప్..**

విద్యాసంస్థల బస్సు పూర్తి వివరాలను తెలుసుకునేందుకు రవాణాశాఖ ఈయాప్‌ను అందుబాటులో ఉంచింది. ఇందులో బస్సు నెంబర్ ఎంటర్ చేయగానే బస్సు, యాజమాన్యం, డ్రైవర్ ఫోటో, అటెండర్ ఫోటోతో పూర్తి వివరాలు ,ఫోన్ నెంబర్లు కనిపిస్తాయి.

**తల్లిదండ్రులు బాధ్యత ..**

బస్సు కండిషన్‌ను పరిశీలించాలి. నిర్దేశించిన ప్రదేశంలో సమయానికి ముందే పిల్లను తయారు చేసి బస్సు వద్దకు తీసుకురావాలి. రన్నింగ్‌లో ఉన్నపుపడు బస్సు ఎక్కించొద్దు. విద్యార్థులను బడికి పంపే సమయంలో, తిరిగి వచ్చే సమయంలో తప్పనిసరిగా కుటుంబ సభ్యులు ఉండాలి. పరిమితికి మించి విద్యార్థులు తీసుకెళ్తున్నారా గమనించాలి. అవసరమైతే తల్లిదండ్రుల సమావేశంలో ప్రశ్నించాలి.

**పాఠశాల యాజమానాన్యలు పాటించాల్సిన నిబంధనలు ..**

పసుపు రంగు బస్సులను మాత్రమే ఉపయోగించాలి. దానిపైభాగంలో నాలుగు వైపులా పసుపు రంగు (పార్కింగ్ )లైట్లు ఉండాలి. ఆగిన సమయంలో వాటిని వేయడం వల్ల ఇతర వాహనాలకు సూచనగా ఉంటుంది. డ్రైవర్‌కు భారీ వాహనాలు నడిపే లైసెన్స్ ఉండాలి. ఐదేళ్ల అనుభవం తప్పనిసరి. 60ఏళ్లలోపు మాత్రమే ఉండాలి. డ్రైవర్ లైసెన్స్ ను పాఠశాల యాజమాన్యం విధగా ఆర్టీఏ కార్యాలయంలో తనిఖీ చేసుకోవాలి. డ్రైవర్‌కు ఖాకీరంగు యూనిఫాం ఉండేలా చూడాలి. నెలకు ఒకసారి తల్లిదండ్రులు (పేరెంట్స్ )తో సమావేశం నిర్వహించాలి. డ్రైవర్ ,అటెండర్ ఏమైనా పొరపాట్లు చేశారా .బాధ్యతలను మరిచారా ..అనే విషయాలను తల్లిదండ్రుల నుంచి తెలుసుకోవాలి. 15ఏళ్ల కాలపరిమితి దాటి వాహనాలను నడపొద్దు. బస్సులు వెళ్లే మార్గాలను సూచించే రూట్ మ్యాప్‌ను విద్యార్థులకు కనిపించే విధంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయాలి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదు. డ్రైవర్‌తోపాటు సహాయకుడు (అటెండర్ )తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థుల రోడ్డు దాటి వెళ్ళాల్సి వచ్చినప్పుడు డ్రైవర్ ముందు నుంచే దాటించాలి. ఇలా చేయడం వల్ల ఇతర వాహనదారులు నుంచి ప్రమాదాలు జరుగవు. నెలకు ఒకసారి డ్రైవర్‌కు బిపి, మధుమేహం, కంటిచూపు పరీక్షలను విధగా చేయించాలి. ఫిట్‌నెస్ సమయంలో పాఠశాల యాజమాన్యం ,డ్రైవర్ అటెండర్ పూర్తి వివరాలను అందించాలి. డ్రైవర్ అటెండర్ పేరు ఫోన్‌నెంబర్లు బస్సుపై రాసి ఉంచాలి. రాకపోకల వివరాలు తల్లిదండ్రులకు తెలిపేందుకు అటెండర్ వద్ద ఫోన్ అందుబాటులో ఉంచాలి. సీరియల్ నెంబర్‌తో కూడిన ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉంచాలి.

**ప్రథమ చికిత్స పెట్టే:** డ్రైవర్ సీటుకు వెనుక భాగంలో విధిగా ఉండాలి. ఇందులో 26రకాల మందుల సామాగ్రి (మెడికల్ కిట్ ) అందుబాటులో ఉంచాలి.

**ఫైర్ సిలిండర్ :** కార్బన్‌డైఆక్సైడ్ (సివో2) ద్రావణం నింపి ఉన్న ఎరుపు రంగుతో కూడిన సిలిండర్ డ్రైవర్‌కు సమీపంలో ఉండాలి.

**మ్యాట్ :** విద్యార్థుల కాళ్లకు దెబ్బలు తగలకుండా కింది భాగంగా మ్యాట్ తప్పనిసరిగా ఉండాలి.

**విద్యార్థులకు రక్షణ రాడ్‌లు:** విద్యార్థులు బయటకు చేతులు తలలు పెట్టకుండా బస్సు చుట్టూ ఉన్న కిటికీలకు లద్దుగా రెండు ,మూడు ఇనుపరాడ్‌లను ఏర్పాటు చేయాలి.

**అత్యవసర ద్వారం :** డ్రైవర్‌కు కుడిచేతి వైపు బస్సుకు చితర అత్యవసర ద్వారం (ఎమర్జెన్సీ ఎగ్జిట్ ) ఉండాలి. ఈద్వారానికి లోపల బయట ఉన్న వారికి కనిపించే విధంగా ఎరుపు అక్షరాలతో అత్యవసర ద్వారా అని రాసి ఉండాలి.

# నగరంలో భారీ వర్షం..

**-రహదారులపై చేరిన నీరు ..**
**-పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం**
**-జిహెచ్ఎంసి,హైడ్రా సిబ్బంది అప్రమత్తం**





**హైదరాబాద్,జూన్ 13,ప్రభాతవార్త:** నగరంలో శనివారం సాయంత్రం అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా ఆఫీసుల నుంచి ఇంటికి చేరే వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శంషాబాద్ ప్రధాన రహదారిపై భారీగా వర్షపు నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రాందేవ్ గూడా, మణికొండ, నార్సింగి, లంగర్ హౌస్, హైదర్ గూడా, అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం ప్రాంతాలను ముంచెత్తింది. మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీ షరీఫ్, జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, అమీర్పేట్, యూసుఫ్ గూడా, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్ మూసాపేట్ పరిసరాల ప్రాంతాల్లో వాన జోరుగా పడింది.నగరంలోని ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్, చిక్కడపల్లి, బాగ్‌లింగం పల్లి, కవాడీగూడ, బోలక్ పూర్, గాంధీనగర్, అంబర్‌పేట, బర్కత్‌పురా, కాచిగూడ, జూబ్లీ హిల్స్, బంజారాహి ల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడలో వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, లింగం పల్లి, మూసాపేట, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్ ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీవాన పడింది.

**నీటిలోనే ప్రయాణించాల్సిన దుస్థితి..**

పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం కారణంగా స్థానికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. శంషాబాద్ ప్రధాన రహదారిపై భారీగా వర్షపు నీరు చేరి చెరువుగా మారింది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డుపై నీరు ఉండంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలు నీటిలోనే ప్రయాణించాయి. వర్షపు నీటిని మోటర్ల ద్వారా సిబ్బంది తొలగించారు. భారీ వర్షానికి జాతీయ రహదారిపై భారీగా నీరు నిలిచింది. బెంగళూరు హైదరాబాద్ హైవేపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

**అధికారులకు సీఎం ఆదేశాలు.**

భారీ వర్షాల దృష్ట్యా సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలో హైఅలర్ట్‌గా ఉండాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డు, సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా టీమ్స్ మోహరించాలని సూచించారు.

# హైడ్రా సహాయక చర్యల్లో 'బైక్ టీమ్'

**-20 బైకులు.. 3 షిఫ్టుల్లో 60 మంది సేవలు -చెట్లు పడిన వెంటనే తొలగించే పనులు**



**హైదరాబాద్, జూన్ 13,ప్రభాతవార్త:** వర్షాకాలం ఆరంభమైంది. గాలీ వాన నగర వాసులను భయపెడుతోంది. అరగంట, గంట సమయంలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదౌతోంది. వరద నీరు రహదారులను ముంచెత్తుతుంటే.. మరోవైపు దారికడ్డంగా పడిపోతున్న చెట్లు రాకపోకలకు అంతరాయంగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టడానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. హైడ్రా డీఆర్ ఎఫ్ వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేని పరిస్థితుల్లో హైడ్రా బైకు టీమ్‌లు తక్షణమే అక్కడకు చేరుకుని సహాయక చర్యల్లో నిమగ్నమౌతున్నాయి. గతేడాది హైడ్రా పోలీసు స్టేషన్ ప్రారంభోత్సవంలో భాగంగా బైకు టీమ్‌లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సారి బైక్‌టీమ్‌లను మరింత సమర్థవంతంగా వినియోగించుకునే పనిలో హైడ్రా నిమగ్నమైంది. మొత్తం 20 బైకులను డీఆర్ఎఫ్ వాహనాల చెంతనే అందుబాటులోకి ఉంచుతున్నారు. డీఆర్ఎఫ్ వాహనం వెళ్లే వీలు లేని పరిస్థితుల్లో బైకు టీమ్‌లు స్పాట్‌కు చేరకుని సహాయక చర్యలు చేపట్టేలా హైడ్రా చర్యలు తీసుకుంది.

**ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌గా..**

హైడ్రా బైక్ టీమ్‌లు 24 ఇంటూ 7 గా పని చేస్తున్నాయి. మొత్తం 60 మంది మూడు షిఫ్టుల్లో అందు బాటులో ఉంటారు. ముఖ్యమైన ప్రాంతాలతో పాటు.. ప్రధానమైన రహదారుల వెంట ఉన్న డీఆర్ఎఫ్ వాహనాల్లోనే వీటిని ఉంచి ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌గా వినియోగిస్తున్నారు. బైకులకు బాక్సులు కూడా అమర్చి అందులో రెండు చైన్ సా(బ్యాట రీతో నడిచే రంపాలు)లు, బలమైన రోప్ (తాడు) ఉంటుంది. చెట్టు కొమ్మలను వెనువెంటనే కట్ చేసి తాడు సాయంతో ఆ చెట్టును పక్కకు లాగడానికి వెసులుబాటుగా ఉండే పరికరాలు ఆ బాక్సు లో ఉంచుతారు. నగరంలో డీఆర్ఎఫ్, మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు, స్టాటిక్ టీమ్‌లకు అదనం గా బైకు టీమ్‌లు పని చేస్తాయి. రహదారిపై తీవ్ర మైన ట్రాఫిక్ జామ్ ఉన్నా బైకును ఫుట్‌పాత్ ఎక్కించి ఎమర్జెన్సీ సేవల్లో బాగంగా ఘటనాస్థలికి చేరుకుంటారు. అలాంటి అవకాశం కూడా లేని పక్షంలో పనిముట్లు చేతిలో పట్టుకుని ఘటనా స్థలానికి చేరుకుంటారు. ముందుగా రహదారిపై ఉన్న ఆటంకాలు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేయడంలో హైడ్రాలో బైక్ టీమ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**వాటర్ లాగింగ్ పాయింట్లలోనూ..**

చెట్లు పడిపోయినప్పుడే కాదు రహదారులపై నీరు నిలిచినప్పుడు కూడా గడ్డపారతో పాటు ఇతర పనిముట్లు తీసుకుని ఈబైక్ టీమ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుంటాయి.వెనువెంటనే సహాయక చర్యలు చేపట్టి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తాయి. ఈ విధంగా మల్టీ టాస్కు పనులు చేసేందుకు వీలుగా వీరికి హైడ్రా శిక్షణ ఇచ్చింది. డీఆర్ఎఫ్ సిబ్బందిలో ఒకరు వీరికి తోడుగా ఉండి పనులు చేపడతారు. మెట్ టీమ్‌లు, స్టాటిక్ టీమ్‌లు, డీఆర్ ఎఫ్ టీమ్‌లు కలసి వరద పరిస్థితులే కాకుండా రహదారుల్లో ఆటంకాలను కూడా తొలగించడంలో నిమగ్నమోతారు. శుక్రవారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1లో వరుసగా ఇరువైపులా 3 చెట్లు కూలి పోయాయి.

నిమ్స్‌లోని మిలీనియం బ్లాక్‌పైన చెట్లు పడిపోయాయి. డీఆర్ఎఫ్ ట్రక్కులు వచ్చేసరికి ఆలస్యం అయ్యే పరిస్థితులుండడంతో బైక్ టీమ్‌లు చెట్లు నరికే రంపాలు పట్టుకు వచ్చి భవనంలోని కిటికీల ద్వారా వాటిని తొలగిం చారు. అలాగే అదే మార్గంలో కొమ్మలను వెను వెంటనే తొలగించి ఒకవైపు ట్రాఫిక్‌కు అం తరాయం లేకుండా చేసి రాకపోకలను సులభం చేశారు. ఇలా బైక్ టీమ్‌లు ఇప్పుడు హైడ్రాలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్‌గా సేవందించడంలో ముందుంటున్నాయి.

# వర్షాకాలం..అప్రమత్తం చేసిన జలమండలి ఎండి

**-జేఎండీ మయాంక్ మిట్టల్‌తో కలిసి ఎండీ టెలీకాన్ఫరెన్స్**

**హైదరాబాద్ జూన్ 13 ప్రభాతవార్త**

నగరంలో కురుస్తున్న వర్షాలవల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఈఆర్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జేఎండీ మయాంక్ మిట్టల్‌తో కలిసి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో వర్షంకాలం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు, ఎస్పీటి వాహనాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తరచూ సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్హోళ్లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నీరు నిలిచే ప్రాంతాలపైన ఈ బృందాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తాగునీటిలో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి సరఫరాపై అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని.. ఈ ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని.. అధికారులు 24 గంటలు క్షేత్ర స్థాయిలో సిబ్బందితో పర్యవేక్షించుకోవాలని సూచించారు. సీవరేజి ఓవర్ ఫ్లో ను సీరియస్‌గా తీసుకుని ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు. వివిధ అంశాలపై వచ్చే ఫిర్యాదుల్ని అరగంటలో పరిష్కరించాలన్నారు. సీవరేజీ ఓవర్ ఫ్లో తో పాటు కలుషిత నీటి సరఫరా వంటి వాటిపై వచ్చే ఫిర్యాదులను.. అరగంటలో పరిష్కరించాలని ఆదేశించారు. వాటర్ హాట్ స్పాట్లు గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మ్యాన్ హోల్స్ కు సేఫ్టీ గ్రిల్స్ బిగింపు, ప్రమాదకర మ్యాన్ హోల్స్ వద్ద రెడ్ ఫ్లాగ్స్, సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వివరించారు. వర్షాకాలంలో కలుషిత నీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ యంత్రాలను సమర్థంగా ఉపయోగించుకోవాలని ఎండీ సూచించారు. జలమండలి, జీహెచ్ఎంసీ 140 వాటర్ లాగింగ్ పాయింట్లను నిత్యం పర్యవేక్షించాలని ఎండీ తెలిపారు. మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. మంచి నీటి పైపు లైను నాలా క్రాసింగ్ వద్ద చెత్త చేరకుండా సంబంధిత అధికారులు జాగ్రత్త వహించాలని సూచించారు. ముంపునకు గురైన మ్యాన్ హోళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారుల మీద ఉన్న మ్యాన్ హోళ్లకి.. ఎరుపు రంగు వేయాలని ఎండీ ఆదేశిం చారు. డీప్ మ్యాన్ హోళ్ల దగ్గర సీవరేజి సూపర్వై జర్లు ఉండేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది యూనిఫాం ధరించి.. తప్పని సరిగా రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచు కోవాలని సూచించారు. బోర్డు సిబ్బంది అంతా ఈ సీజన్ లో విమర్శలకు తావు లేకుండా పనిచేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్ శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని ఆయన సూచించారు. ఇతర వివరాలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి కాల్ చేయాలని కోరారు.

## ఎంఎంసీ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కమిషనర్



ఎంఎంసీ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, జూన్ 13 ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలనా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఉప్పల్ భగాయత్‌లో నిర్మించనున్న నూతన ప్రధాన కార్యాలయ భవనానికి కేటాయించిన స్థలాన్ని ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విభాగం అధికారులు, టౌన్ టౌన్ ప్లానింగ్, సంబంధిత సిబ్బందితో కలిసి స్థల పరిస్థితులను, భవన నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసేందుకు అనుభవజ్ఞులైన ఆర్కిటెక్ట్‌లతో సంప్రదించి సమగ్ర ప్లాన్లను రూపొందించాలని ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. భవనం నిర్మాణంలో కార్యాలయ అవసరాలతో పాటు ప్రజల సౌకర్యం, పార్కింగ్, సమావేశ మందిరాలు, డిజిటల్ సేవల కేంద్రాలు, ఇతర మౌలిక వసతులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. దీంతో పాటు వాటర్ బోర్డు, హైడ్రా వంటి ప్రభుత్వ సంస్థలకు అవసరమైన కార్యాలయ స్థలాన్ని ముందుగానే గుర్తించి, ఆయా విభాగాల అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణ ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా సమగ్ర పరిపాలనా కేంద్రంగా ఈ భవనాన్ని అభివృద్ధి చేయాలన్నారు.

## సర్‌పై సీఈఓకు అసదుద్దీన్ ఓవైసీ వినతి



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

**చార్మినార్,జూన్ 13 ప్రభాతవార్త :** స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (సర్) ప్రక్రియపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూతెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఓ) సి.సుదర్శన్ రెడ్డికి ఎఐఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ వినతి పత్రం అందజేశారు. స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (సర్) లో ధృవీకరణ కోసం పాన్ కార్డు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డ్రైవింగ్ లైసెన్స్,ఆహార భద్రతా కార్డు (రేషన్‌కార్డు)ల పత్రాలను అనుమతించాలని,2002 ఓటర్ లిస్ట్‌లో వివరాలు లేని ఓటర్లు కోసం ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రాసీజర్ జారీచేయాలని,ఎన్యుమరేషన్ ఫారాలను తెలుగు,ఆంగ్లం,ఊర్దూ భాషలోలలో అందుబాటులో ఉంచాలని ఆయన సిఈఓను కోరారు.బిఎల్ఓలు మూడు భాషలలో ఉన్న గణన ఫారాలను ప్రజలకు అందించాలని ఆయన సిఈఓకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

## నిమ్స్ వద్ద చెట్టు కూలి ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

**జూబ్లీహిల్స్, జూన్ 13, ప్రభాతవార్త:** నిమ్స్ ఆస్పత్రి వెనుక భాగంలో రోడ్ నంబర్1లో పార్క్ సిటీ ప్లాజా సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా ఓ పెద్ద చెట్టు నేలకూలింది. కూలిన చెట్టు అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో అది దెబ్బతింది. ఆ ప్రభావంతో మిలీనియం బ్లాక్‌కు విద్యుత్ సరఫరా చేస్తున్న మరో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి మిలీనియం బ్లాక్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో మిలీనియం బ్లాక్‌లో అత్యవసర వైద్య సేవలు పొందుతున్న సుమారు 50 మంది రోగులున్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో డీజీ సెట్ల ద్వారా అత్యవసరంగా విద్యుత్ సరఫరా కొనసాగించారు. సమాచారం అందుకున్న వెంటనే విద్యుత్ శాఖ డీఈ(ఆపరేషన్స్) గోపి సంఘటనా స్థలానికి చేరుకుని పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం, గాయాలు సంభవించలేదని అధికారులు తెలిపారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డీఆర్ఎఫ్) సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు.

## వర్క్ ఫ్రమ్ బైక్..!

**-అంత ఆత్రుత ఎందుకు : సిపి సజ్జనార్**

**హైదరాబాద్, జూన్ 13 ప్రభాతవార్త**

రైళ్లు, బస్సుల్లో ప్రయాణిస్తూనే.. కొందరు ఐటీ ఉద్యోగులు ల్యాప్‌టాప్‌లో వర్క్ చేస్తూ ఉండటం అప్పుడప్పుడు మనం చూస్తూనే ఉంటాం. అలా హైదరాబాద్‌లో ఓ యువకుడు బైక్‌పై వెళ్తూ.. ల్యాప్‌టాప్‌లో వర్క్ చేయడం చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ కాగా.. ఈ వ్యవహారం కాస్త తీవ్రరూపం దాల్చడంతో దీనిపై సీపీ సజ్జనార్ స్పందించారు. వీడియోను సజ్జనార్ ఎక్స్‌లో పోస్టు చేశారు."ఏ పనికైనా ఓ పద్ధతి ఉంటుంది. కానీ, ప్రాణాలను పణంగా పెట్టి ఇలా వర్క్ ఫ్రమ్ బైక్ చేయడం చూస్తుంటే.. "ఆత్రుత ఎక్కువైతే ప్రాణం మీదకు వస్తుందనే మాట" నిజమనిపిస్తోంది. రోడ్డుపై ఒక్కక్షణం ఏకాగ్రత తప్పినా అది మీ ప్రాణానికే ప్రమాదం. పక్కన వెళ్లే అమాయకులకు కూడా ప్రమాదకరం. కడుపు నింపుకోవడానికి చేసే పని.. కడతేర్చేలా ఉండకూడదని గుర్తు పెట్టుకోండి. రోడ్డుపై ఇలాంటి బాధ్యతారాహిత్యమైన పనులు మానుకోండి. సురక్షితంగా ప్రయాణించి.. గమ్యస్థానాలకు చేరుకోండి" అని ఆయన రాసుకొచ్చారు రోడ్డుపై ఇలాంటి బాధ్యతారాహిత్యమైన పనులు మానుకోవాలని హితవు పలికారు.

**ల్యాప్‌టాప్‌తో 'వర్క్ ఫ్రమ్ బైక్' ప్రయాణం..**

వైరల్ అవుతున్న వీడియో ప్రకారం..హైదరాబాద్‌లోని ఒక బిజీ రోడ్డుపై యువకుడు బైక్ నడుపుతున్నాడు. కానీ, అందరి దృష్టి అతడి డ్రైవింగ్ కంటే కూడా బైక్ ఫ్యూయల్ బ్యాంక్‌పై ఉన్న వస్తువు వైపు ఉంది. ఆ యువకుడు బైక్ ట్యాంక్‌పై ల్యాప్‌టాప్ ఉంచి..ప్రయాణంలోనూ ఆఫీస్ పనిలో మునిగిపోయాడు. రోడ్డుపై వేగంగా బైక్ వెళ్తుండగా, ల్యాప్‌టాప్ స్క్రీన్ ఓపెన్ చేసి ఉండి, అతడు దానిని చూస్తూ డ్రైవింగ్ చేయడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. పక్కన వెళ్తున్న ఇతర వాహనదారులు ఈ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను చూసి షాక్‌కు గురయ్యారు. రోడ్డుపై వెళ్తున్న ఒక వ్యక్తి ఈ ప్రమాదకరమైన దృశ్యాన్ని తన మొబైల్ కెమెరాలో బంధించడంతో ఈ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది.



డుండిగల్‌లోని ఎయిర్ ఫోర్స్ అకాడమీలో 217వ కోర్సు పట్టభద్రుల కవాతు, విన్యాసాలు





## తెలంగాణ కాంట్రాక్టర్ల ఛలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను విడుదల చేస్తున్న కాంట్రాక్టర్లు

**జూబ్లీహిల్స్, జూన్ 13, ప్రభాతవార్త:** పెండింగ్ బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఛలో హైదరాబాద్ మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. మాదాపూర్ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయ భవనంలో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంటర్ ఛైర్మన్ సల్ల శ్రీనివాసరావు, రాష్ట్ర ఛైర్మన్ వి. రవీందర్‌రెడ్డి, ఆలిండియా ఉపాధ్యక్షుడు వి. సత్యమూర్తి, మాజీ అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవుతూ, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, మున్సిపల్, విద్యుత్ వంటి కీలక శాఖల్లో పనులు చేసి దాదాపు నాలుగేళ్ల గడుస్తున్నా ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదన్నారు. తెలంగాణవ్యాప్తంగా ఐదు నుంచి కోటి రూపాయల లోపు పనులు చేసే చిన్న తరహా కాంట్రాక్టర్లే అత్యధికంగా ఉన్నారన్నారు. అప్పులు తెచ్చి పనులు చేసిన మధ్యతరగతి కాంట్రాక్టర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందన్నారు. అయిదేళ్లుగా ఓపిక పట్టామని, ఉన్న ఆస్తులు, ఇళ్ల తాకట్టు పెట్టామని, బ్యాంక్ బ్యాలెన్స్ అంతా శూన్యమైందని, అప్పులు ఇచ్చిన వాళ్లు ఇంటి మీదకు వస్తుంటే తలదాచుకోలేక, ఇంటికి వెళ్లలేక రోడ్డున పడ్డామన్నారు. ప్రభుత్వం మమ్మల్ని ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తోంది? అని కాంట్రాక్టర్లు కన్నీటి పర్యంతమవుతున్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం తమను ఆదుకోలేదన్నారు. ఈ నేపేథ్యంలోనే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 18న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో మేడ్చల్ మాజీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర సలహాదారు సుధాకర్, భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గన్నారు.

## మంత్రముగ్ధులను చేసిన దుబ్బుల కొలువు జానపద కళారూపం



కళాకారుల దుబ్బులకొలువు జానపద కళారూపం ప్రదర్శనలో ఓ దృశ్యం

**రవీంద్రభారతి, జూన్ 13 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో 99 రోజులపాటు నిర్విరామంగా జరుపుతున్న సాంస్కృతిక మహోత్సవంలో 73వ రోజు తెలంగాణ జానపద కళాసంపదకు ప్రతీకగా నిలిచిన దుబ్బుల కొలువు అపురూప కళారూపం తెలంగాణ ప్రజాకళ ప్రదర్శనల్లో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాల నుండి విచ్చేసిన కళాకారులు బోయిన శ్రీకాంత్, జునగిరి గణేష్, బోయిరి సంపత్, లక్ష్మణ్, రవీందర్, శేఖర్‌లు తమ అద్భుత అభినయం, సంప్రదాయిక ప్రదర్శనతో దుబ్బులకొలువు జానపద కళారూపాన్ని గొప్పగా ఆవిష్కరించి ప్రతీ ఒక్కరిని ఆకట్టుకుని ప్రశంసలందుకున్నారు. ఈ ప్రదర్శన తెలంగాణ గ్రామీణ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనంగానే కాకుండా దుర్గమ్మ కొలువు మన పూర్వీకుల జీవన విధానాన్ని సజీవంగా ప్రతిబింబించడం విశేషం. నేటి తెలంగాణ ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు డా. విజయ్‌కుమార్, దినకర్, యశ్‌పాల్ తదితరులతో కలిసి కళాకారులను ఘనంగా సత్కరించి ప్రసంగిస్తూ అంతరించిపోతున్న జానపద కళలను, కళాకారులను పరిరక్షించి ప్రోత్సహించడం తమ ప్రధాన బాధ్యతని స్పష్టం చేశారు. ఇలాంటి అరుదైన కళారూపాలను తరతరాలకు అందించేలా ప్రభుత్వం నిరంతర కృషిచేస్తుందని భరోసానిచ్చారు.


ఖైరతాబాద్ ఠాణాలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సందీప్‌రెడ్డి ఇటీవల జూబ్లీహిల్స్ ఠాణాకు బదిలీ అయ్యారు. ఖైరతాబాద్ ఠాణా ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, ఎస్సైలు రమణ, ప్రణీత్, సమీర్‌లతోపాటు సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయనను సన్మానించి ముున్ముందు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## ఉద్యమకారుల సంక్షేమానికి కేకే కమిటీ చిత్తశుద్ధితో కృషి చేస్తుంది: ప్రొఫెసర్ కోదండరాం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

**చిక్కడపల్లి జూన్ 13 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ అత్యంత చిత్తశుద్ధితో పనిచేస్తుందని, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ఉద్యమకారులందరినీ గుర్తించి తగిన గుర్తింపు, సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, కేకే కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దివంగత గుండా యాదగిరి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో గుండా యాదగిరి చేసిన సేవలను కొనియాడారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించడం మన బాధ్యత అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కమిటీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ బాగయ్య, టీజేఎస్ హైదరాబాద్ అధ్యక్షుడు మేకపోతుల నర్సయ్య గౌడ్, టీయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్, ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న, టీయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి ప్రకాష్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకురాలు జానకి రెడ్డి, తెలంగాణ వనరుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గోర శ్యాం సుందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాండు గౌడ్, బీరకాయల మధుసూదన్, రాజు గౌడ్, రమావత్ శీను నాయక్, గౌరి గణేష్, వీరాస్వామి, రాంచందర్, శంకరయ్య, రవి, అర్జున్ రావు మరియు గుండా యాదగిరి కుటుంబ సభ్యులు ప్రసన్న, అనిల్ కుమార్, అనిత, భార్గవ్, గాయత్రి, అశోక్ తదితరులు పాల్గొని యాదగిరి చిత్రపటానికి నివాళులర్పించారు.

## పన్ను చెల్లింపులో 4వ స్థానంలో తెలుగు రాష్ట్రాలు

-తప్పుడు రిటర్న్‌లు,పన్ను ఎగవేతకు జైలు శిక్ష తప్పదు

:ఆదాయపు పన్ను తెలుగు రాష్ట్రాల కమిషనర్లు బాలకృష్ణ, హరిత

**హైదరాబాద్, జూన్ 13 ప్రభాతవార్త**

ఈసారి పూర్తయిన ఆర్థిక సంవత్సరంలో 1,25,000 వేల కోట్ల ఆదాయపు పన్ను చెల్లింపులతో తెలుగు రాష్ట్రాలు దేశంలో 4వ స్థానానికి చేరుకున్నాయని, ఈ చెల్లింపులు దేశాభివృద్ధి మరియు జాతి నిర్మాణంలో భాగస్వామ్యం అవుతున్నాయని టీజీ, ఏపీ రాష్ట్రాల ఆదాయపు పన్ను కమిషనర్లు బి. బాలకృష్ణ, (ఇంటర్నేషనల్ టాక్సషన్ టి.పి) కె. హరిత (మినహాయింపులు)లు తెలిపారు. శనివారం సికింద్రాబాద్‌లో తెలుగు రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ "ఆదాయపు పన్ను సమస్యలపై" ఆదాయపు పన్ను కమిషనర్లతో బహిరంగ చర్చా కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఛార్టర్డ్ అకౌంటెంట్‌లు, పన్ను న్యాయవాదులు హాజరై తమ సందేహాలను కమిషనర్లను ప్రశ్నల రూపంలో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు సీఏ చంద్రశేఖర్ వేముల అధ్యక్షత వహించగా మొదట బి. బాలకృష్ణ అసోసియేషన్ తెలుగు రాష్ట్రాల నూతన మెంబర్స్ డైరెక్టరీను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సీఏ ఆశిష్ జోషి, కోశాధికారి సోమేశ్వర్ నెమ్మాని, సలహాదారు సీఏ రామ్‌దేవ్ బుటాడా, కంపిటేషన్ కమిటీ చైర్మన్ సీఏ అమృత్ కుమార్ కోటా, ఉపాధ్యక్షులు సీఏ పి.వి. నారాయణరావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు సీఏ ప్రవల్లిక వేముల, సిఏ ప్రకాష్ చోక దా, సీఏ వెంకట్ రామ్,సీఏ శైలేంద్ర శర్మ, సిఏలీల కృష్ణ మోహన్,ఎన్.వి.చారి,అజయ్ వాల్యే,ఏపీదహిమా పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం



**కార్వాన్,జూన్ 13 (ప్రభాతవార్త)** సైబర్ నేరాల పట్ల అప్రమత్తతతో సరైన అవగాహన కలిగి ఉండడం ద్వారానే మోసాలను నివారించవచ్చునాని టప్పాచబుత్ర పోలీస్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ ప్రజలకు హితవు పలికారు. టప్పాచబుత్ర పిఎస్ పరిధిలోని తాళ్లగడ్డ కబ్బాడి స్టేడియం వద్ద నుండి సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ.. డిజిటల్ లావాదేవీలు పెరిగిన ప్రస్తుత తరుణంలో వ్యక్తిగత సమాచారం గోప్యత,అనుమానాస్పద లింక్‌లు,ఓటీపీల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.సోషల్ మీడియాలో ఆధార్,పాన్ కార్డ్,ఫోటోలను బహిరంగంగా షేర్ చేయవద్దని,తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు,ఉచిత బహుమతులు ఇచ్చే యాప్‌లు, వెబ్‌సైట్లను నమ్మవద్దని అలాంటివి జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.

## మొహర్రం ఊరేగింపుకు ఏనుగును సమకూర్చుతామని హామీ


రాష్ట్ర పర్యావరణ,అటవీ,విజ్ఞాన,సాంకేతిక శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్‌ను కలిసిన బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

**చార్మినార్,జూన్ 13 ప్రభాతవార్త :** మొహర్రం పదివ రోజున పాతబస్తీ డబీర్‌పురలోని బీబీ–కా–ఆలం నుంచి ప్రారంభం కానున్న చారిత్రక బీబీ–కా–ఆలం ఊరేగింపు కోసం ఏనుగును సమకూర్చటానికి ఆమోదం తెలిపినందుకు కేంద్రబొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి,రాష్ట్ర ప్రభుత్వానికి సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ధన్య వాదాలు తెలిపారు.ఈ నెల 27వ తేదీన జరగనున్న మొహర్రం ఊరేగింపుకు ఏనుగును అనుమతించాలని పాతబస్తీకి చెందిన సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని అభ్యర్థించారు.ఈ విషయాన్ని పరిశీలించాలని ఆదేశాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇచ్చిన విఐపి రిఫరెన్స్‌ను రాష్ట్ర పర్యావరణ,అటవీ,విజ్ఞాన,సాంకేతిక శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అహ్మద్ నదీమ్‌కు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అందజేశారు.ఏనుగును సమకూర్చటానికి అనుమతించినందుకు రాష్ట్ర పర్యావరణ,అటవీ, విజ్ఞాన, సాంకేతిక శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అహ్మద్ నదీమ్‌కు,వైల్డ్ లైఫ్ వార్డెన్,ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్ వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్‌లకు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## సోమాజీగూడ డివిజన్‌లో బిఆర్ఎస్‌లో చేరికలు



**జూబ్లీహిల్స్, జూన్ 13, ప్రభాతవార్త:** ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు బీఆర్ఎస్ అదినేత కేసీఆర్, యువనేత కేటీఆర్ ఆలోచనలకు అనుగుణంగా సోమాజీగూడ డివిజన్‌లో పలువురు యువకులు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సోమాజీగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పోచమ్మ బస్తీకి చెందిన జనార్ధన్, శేఖర్, వెంకటేష్, ఉదయ్‌కిరణ్, సాయికిరణ్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారందరికి మహేష్ యాదవ్ గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండేళ్లలోనే ప్రభుత్వంపైన వ్యతిరేకత వచ్చిందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రజలు సైతం ఈ విషయాన్ని విశ్వసిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, బస్తీ నేలు పాల్గొన్నారు.

## 51 సంచార జాతులను ప్రభుత్వం గుర్తించడం చారిత్రాత్మక నిర్ణయిం


సమావేశంలో అభివాదం తెలుపుతున్న సంఘం నాయకులు

**సైఫాబాద్, జూన్ 13 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 51 సంచార జాతులను (డిఎన్‌టి/ఎన్‌టి/ఎస్ఎన్‌టి) అధికారికంగా గుర్తిస్తూ జివో జివో జారీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని సంచార జాతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్, అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమ సంఘం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు చేసిన అనేక పోరాటాల ఫలితంగానే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు. ప్రభుత్వం బిసి కమిషన్ ద్వారా అధ్యయనం చేసి 51 సంచార జాతులను గుర్తించడం పట్ల సిఎం రేవంత్‌రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీ ప్రకారం సంచార జాతులకు ప్రత్యేకంగా బిసి గ్రూపు ఏర్పాటు చేసి 5 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సంచార జాతుల గుర్తింపు పూర్తియినందున విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రత్యేక రిజర్వేషన్‌లు అమలు చేయడానికి కూడా ఏలాంటి అడ్డంకి లేదన్నారు. రాష్ట్రంలో ప్రత్యేకంగా డిఎన్‌టి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఈ 51 కులాలను ప్రత్యేక గ్రూపుగా ఏర్పాటు చేసి రిజర్వేషన్‌లు కల్పించాలని, ఎంబిసి కార్పొరేషన్‌ను డిఎన్‌టి కార్పొరేషన్‌గా పునర్వ్యవస్థీకరించాలని కోరారు. ఆగస్టు 31 తేదీన హైదరాబాద్ నగరంలో ఒక లక్ష మంది సంచార జాతులతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు.

## బిటెక్ విద్యార్థి రాహుల్ మృతదేహన్ని వెంటనే అప్పగించాలి : తల్లిదండ్రులు


సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్. చిత్రంలో రాహుల్ తల్లిదండ్రులు కూడా ఉన్నారు.

**సైఫాబాద్, జూన్ 13 ప్రభాతవార్త:** తెలంగాణాకి చెంది, ఎపిలోని సింగరాయకొండ సమీపంలోని బావిలో మృతి చెందిన బిటెక్ విద్యార్థి అంకం రాహుల్ మృతదేహన్ని వెంటనే తమకు అప్పగించాలని ఆయన తల్లిదండ్రులు అంకం రాజేశ్వర్, వనిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాహుల్ మృతి చెంది 15 రోజులు గడుస్తున్నప్పటికి డిఎన్ఎ పరీక్షల పేరిట ప్రభుత్వం కాలయాపన చేయడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ కుమారుడిని హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, టైలరింగ్ వృత్తి చేసుకుంటూ తాము కష్టపడి రాహుల్‌ను బిటెక్ 3వ సంవత్సరం వరకు ఇంజనీరింగ్ కళాశాలలో చదివించుకుంటున్నామని తెలిపారు. కళాశాలలో జరిగిన వివాదాల కారణంగా తమ కుమారుడు చనిపోవడం జరిగిందని, ఈ మరణంపై సమగ్రంగా విచారణ జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని వారు రోదిస్తూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న దాసు సురేష్ మాట్లాడుతూ రాహుల్ కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు తల్లిదండ్రులు హైదరాబాద్ నగరం విడిచి వెళ్ళేది లేదని, వారికి అండగా తమ సమితి ఉంటుందన్నారు. 48 గంటల్లోగా సమస్యను ప్రభుత్వం పరిష్కారించకపోతే సమితి కార్యాలయంలో తాము ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. రాహుల్ కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు తమ సమితి పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.

## నిర్బందించి దాడి చేశారంటూ ఫిర్యాదు

**జూబ్లీహిల్స్, జూన్ 13, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లోని ఓ భవన యజమాని తనను, తన సహచరులను అక్రమంగా నిర్బంధించి దాడి చేశారని ఆరోపిస్తూ ఓ ఏసీ కాంట్రాక్టర్ జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి వివరాల మేరకు.. కార్ఖానాకు చెందిన ఎయిర్ ఎన్ గ్యాస్ కంట్రోల్ ఇంజినీర్స్ సంస్థ జూబ్లీహిల్స్ రోడ్ నెం.9లో ఉన్న జీ ప్లస్ 5 భవనంలో సెంట్రల్ ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.45 లక్షల విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పనులు పూర్తిచేసిన అనంతరం రూ.36 లక్షలు చెల్లించగా, మిగిలిన మొత్తం బకాయి భవన యజమాని, ప్రముక వ్యాపారి గుంటి శ్రీధర్ రావు అలియాస్ నంబర్‌వన్ శ్రీధర్‌రావు చెల్లించాల్సి ఉంది. డబ్బులు చెల్లించకుండా అనవసర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వేధింపులకు పాల్పడటం ప్రారంభించాడు. ఈ నెల 9న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ముషీరాబాద్‌కు చెందిన మేకల రమేష్‌తోపాటు అతని సహచరులైన వెంకటేశ్వర ప్రసాద్, శ్రీనివాస్, అంకూర్, జగదీష్, శ్రీనాథ్‌లను గుంటి శ్రీధర్ రావు అతని అనుచరులు, గన్‌మెన్‌లతో కలిసి దాడి చేశారు. దాడి సమయంలో శ్రీధర్ రావు తన వద్ద లైసెన్స్‌డ్ తుపాకీ ఉందని, కాల్చి చంపేస్తానంటూ బెదిరించారని మేకల రమేష్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం తమను సుమారు ఏడు గంటల పాటు భవనంలోనే నిర్బంధించారని, చెల్లించిన మొత్తం డబ్బును తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చి, ఇవ్వకపోతే తప్పుడు కేసులు పెట్టడంతో పాటు రూ.100 కోట్ల సివిల్ దావా వేస్తామని బెదిరించారన్నారు. ఈ ఘటనలో తమ సహచరుడు జగదీశ్ నల్లి గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందాడని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఫిర్యాదును స్వీకరించినట్లు జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.

## జిల్లెలగూడలో థార్ వాహనం భీభత్సం

**సరూర్‌నగర్, జూన్ 13 ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఏరియా జిల్లెలగూడ దాసరి నారాయణరావు కాలనీలో థార్ కారు భీభత్సం సృష్టించింది. శనివారం ఉదయం మద్యం సేవించినట్లు అనుమానిస్తున్న ఓ వ్యక్తి థార్ వాహనాన్ని అతి వేగంతో నడుపుతూ వచ్చి స్కూటర్‌పై పాల ప్యాకెట్లు సరఫరా చేస్తున్న ఇద్దరు అన్నదమ్ములను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా స్థానికులు వారిని ఎల్‌బినగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఉదయం జిల్లెలగూడ దాసరి నారాయణరావు కాలనీ వీకర్ సెక్షన్ కాలనీలోని రోడ్డులో టిజి 08 ఎ 7887 నెంబర్ గల థార్ కారు ఒక్కసారిగా వేగంగా దూసుకువచ్చి భీభత్సం సృష్టించింది. ఈ నేపథ్యంలో స్కూటర్‌ను ఢీకొట్టడంతో పాల ప్యాకెట్లు సరఫరా చేస్తున్న జిల్లెలగూడ కమలానెహ్రూనగర్ కాలనీకి చెందిన అన్నదమ్ములు అఖిలేశ్వర్ (22), విఘ్నేశ్వర్ (16)లు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్పందించిన స్థానిక కాలనీవాసులు వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన థార్ వాహనంలో ముందు, వెనక సీట్లలో మద్యం బాటిళ్ల లభించడంతో వాహనాన్ని నడుపుతున్న వ్యక్తి మద్యం సేవించినట్లు భావిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మీర్‌పేట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసును దర్యాప్తు చేస్తున్నారు. అయితే థార్ వాహనాన్ని అల్మాస్‌గూడకు చెందిన చక్రీధర్ అనే వ్యక్తి నడిపినట్లు పోలీసులు తెలిపారు.

## విధుల్లో ఉన్న హోంగార్డు గుండెపోటుతో మృతి

**జూబ్లీహిల్స్, జూన్ 13, ప్రభాతవార్త:** ఫిల్మ్‌నగర్ ఠాణాలో విధులు నిర్వర్తించే ఒక హోంగార్డు గుండెపోటుతో మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. ఒంగోలుకు చెంది ఉప్పల్‌లో నివసిస్తున్న డి. ఓబులేసు(39) ఏడాది కాలంగా ఫిల్మ్‌నగర్ ఠాణాలో బ్లూకోల్ట్స్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఫిల్మ్‌నగర్‌లోని శంకర్‌విలాస్ హోటల్ వద్దకు వచ్చిన అతను హోటల్‌లోకి వెళ్లే క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో చుట్టుపక్కల ఉన్న వారు వెంటనే అతనికి ప్రాథమికంగా సీపీఆర్ చేశారు. అనంతరం సమీపంలో ఉన్న అపోలో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తేల్చిచెప్పారు. మృతుడికి ఇద్దరు పదేళ్లలోపు ఇద్దరు పిల్లలున్నారు.

## తాటి చెట్టు కూలి వృద్ధురాలు దుర్మరణం

**సరూర్‌నగర్, జూన్ 13 ప్రభాతవార్త:** బలమైన ఈదురు గాలులు ఓ వృద్ధురాలి ప్రాణాలు తీశాయి. ఒక్కసారిగా వీచిన ఉధృత గాలులకు తాటి చెట్టు కూలి రేకుల ఇంటిపై పడడంతో అందులో నివసిస్తున్న వృద్ధురాలికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచింది. ఈ విషాదకర సంఘటన హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఏరియాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం రాత్రి సుమారు పది గంటల సమయంలో జిల్లెలగూడ రాఘవేంద్రనగర్ కాలనీలో అకస్మాత్తుగా బలమైన గాలులు వీయడంతో స్థానికంగా ఉన్న ఓ తాటి చెట్టు ఉన్న ఫలంగా విరిగి పక్కనే ఉన్న రేకుల ఇంటిపై కుప్పకూలింది. దీంతో ఆ ఇంట్లో నివసిస్తున్న సభావత్ లక్ష్మి సేవ్య (75) అనే వృద్ధురాలిపై రేకులు విరిగి పడడంతో ఆమెకు బలమైన గాయాలు అయ్యాయి. అదే ఇంట్లో నివసిస్తున్న ఆమె కుమారుడు, కోడలు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో స్థానికులు స్పందించి క్షతగాత్రురాలిని వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూనే ఆమె అదే రోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు సభావత్ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## యువనటితో అసభ్య ప్రవర్తన

**జూబ్లీహిల్స్, జూన్ 13, ప్రభాతవార్త:** ఒక యువ నటికి సినీ అవకాశాలు కల్పిస్తానంటూ పరిచయమై కాస్టింగ్ వేధింపులకు పాల్పడిన సంఘటనలో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. మేడిపల్లి ప్రాంతానికి చెందిన యువనటి (21)కి గత ఏడాది ఆకాశంలో ఒక తార సినిమా కోసం హీరోయిన్ స్నేహితురాలి పాత్రలో నటించే అవకాశం కల్పిస్తానంటూ ప్రసాద్ ఆమెను సంప్రదించాడు. 2025 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సినిమా షూటింగ్‌లో పాల్గొన్న తనకు రూ.90 వేల పారితోషికంతో పాటు రూ.38 వేల క్యాబ్ ఖర్చులు చెల్లిస్తామని హామీనిచ్చాడు. షూటింగ్ పూర్తయిన తర్వాత డబ్బులు అడిగితే కాలయాపన చేశాడు. ఫిబ్రవరి 18న బంజారాహిల్స్‌లోని సాగర్ సొసైటీ వద్ద కలవాలని పిలిచిన ప్రసాద్ బలవంతంగా కారులో ఎక్కించి అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మరిన్ని సినిమా అవకాశాలు కల్పిస్తానంటూ తనపై ఒత్తిడి తెచ్చాడని, అక్కడి నుంచి తప్పించుకున్నానన్నారు. పారితోషికం విషయమై తన తల్లి ఫోన్ చేయగా ప్రసాద్ అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు డబ్బులు ఇవ్వనని బెదిరించాడు. తనను, తన తల్లిని చంపేస్తానంటూ బెదిరించాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. జనవరి నుంచి జూన్ 2026 వరకు రూ.1.28 లక్షల బకాయిలు చెల్లించకుండా, ఫోన్ ద్వారా వేధింపులు, బెదిరింపులకు పాల్పడ్డాడన్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ లింగనిర్ధారణ కేసులో ముగ్గురి అరెస్ట్

**వనస్థలిపురం. జూన్.13.ప్రభాతవార్త.** వనస్థలిపురం పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమ లింగ నిర్దారణ చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురం గురుద్వారా రోడ్డు లోని హయగ్రీవ హాస్పిటల్ లో లింగ నిర్దారణ పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం మేరకు డికాయ్ ఆపరేషన్ చేసి హాస్పిటల్ ఎండి కొర్ర రాజు, రిసెప్షనిస్ట్ లోకేష్ తో పాటు తుక్కుగూడ శ్రీ సాయి ధనుష్ క్లినిక్ ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు.హాస్పిటల్ డైరెక్టర్ కొర్ర రాజు, రిసెప్షనిస్ట్ లోకేష్ ఇద్దరూ కలిసి లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తామని హామీ ఇచ్చారు. తుక్కుగూడ వద్ద ఉన్న విజయ్ కుమార్ స్కాన్ చేసి పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అని చెబుతాడని వారు రిఫర్ చేశారు. పోలీసులు తుక్కుగూడ వద్ద శ్రీ సాయి ధనుష్ క్లినిక్‌లోని ల్యాబ్ పై దాడి చేశారు. అక్కడ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న విజయ్ కుమార్‌ను అదుపులోకి ఆరా తీయగా విషయం వెలుగులోకి వచ్చింది. అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పి సి పి ఎన్ డి టి చట్టం ప్రకారం . లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అక్రమ లింగ నిర్ధారణలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు .

## ఇద్దరు పిల్లలతో ఇళ్లు వదిలి వెళ్లిన కోడలు

**చాంద్రాయణగుట్ట, జూన్ 13, ప్రభాతవార్త :** అత్తా కోడళ్లు వాదులాడుకొని, కొడలు తన ఇద్దరు పిల్లలతో ఇళ్లు విడిచిన సంఘటన బండ్లగూడ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడ పటేల్ నగర్ నివాసి, కారు డ్రైవర్‌గా పనిచేసే ముహమ్మద్ ఇబ్రహీం తల్లి జీనత్ బేగం, భార్య సయ్యదా ముజాసిర్‌లు ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం వాదులాడుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన భార్య సయ్యదా ముజాసిర్ (23), కుమార్తె మదియా బేగం (5), కుమారుడు మహ్మద్ ముస్తఫా (3)తో కలిసి ఇంటి నుండి వెళ్లిపోయింది. విధుల నుండి ఇంటికి వచ్చిన ముహమ్మద్ ఇబ్రహీం విషయం తెలుసుకొని భార్య పిల్లల కోసం గాలించాడు. వారి ఆచూకి తెలియకపోవటంతో ఈనెల 12 పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వర్షాకాలానికి ముందే నాలాల పటిష్టతకు చర్యలు చేపట్టాలి

**బేగంపేట, జూన్ 13,ప్రభాతవార్త**


పార్క్‌లైన్ నాలా ప్రహరీని పరిశీలిస్తున్న మాజీ కార్పోరేటర్ చీరె సుచిత్ర.

వర్షాకాలానికి ముందే నాలాల పటిష్టతకు చర్యలు చేపట్టాలని, నాలాల్లో పూడికతీతతో పాటు ప్రహరీల పటిష్టతపై దృష్టి సారించాలని మాజీ కార్పోరేటర్ చీరె సుచిత్ర అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో పార్క్‌లైన్,మెక్లోడిగూడా ,చుట్టల బస్తీ ప్రాంతాల్లోని నాలాల దుస్థితిని రాంగోపాల్‌పేట మాజీ కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ శనివారం క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు.పార్క్‌లైన్ నాలా ప్రహరీ గోడ కింది భాగం పూర్తిగా బలహీన పడి ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదకర స్థితిలో ఉందంటూ స్థానికులు చేసిన ఫిర్యాదుపై మాజీ కార్పోరేటర్ స్పందించారు.ఈ ప్రమాద కర పరిస్థితిని అక్కడి నుంచే నేరుగా కవాడీగూడా డీఈ హేమూ నాయక్,బేగంపేట డీఈ మహేష్ దృష్టికి తీసికెళ్లారు.అయితే వారు నాలా తమ పరిధిలోకి రాదంటూ ఒకరిపై మరొకరు నెట్టుకోవడంపై బస్తీ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాలు ప్రారంభమయితే నాలాలో నీటి ఉధృతి పెరుగుతుందని,ఈ సమయంలో నాలా ప్రహరీ కుంగిపోతే నీరు నేరుగా బస్తీలోని తమ ఇళ్లలోకి చేరుకుంటుందని,దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడతామని వారు చీరె సుచిత్ర కువివరించారు.ఈ సందర్భంగా చీరె సుచిత్ర సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి సమస్యల పట్ల సరిహద్దు వివాదాలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని,వర్షాలు కురవక ముందే కుంగిపోయిన నాలా ప్రహరీని సరిగా నిర్మించాలని,మెక్లోడిగూడాలో కూలిపోయిన ప్రహరీని వెంటనే నిర్మించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ,చెప్పారు. చుట్టల బస్తీ,పార్క్‌లైన్,ప్రాంతాల్లో నాలాలో పూడికతీత సమయంలో 6చోట్ల నాలా ప్రహరీ గోడలను కూల్చి ఇప్పటి వరకు వాటిని పునర్మించడంపై ఉన్నతాధికారులు శ్రద్ధ చూపాలని చీరె కోరారు.ఈ సమస్యకు సంబంధించిన ఫోటోలు,వీడియోలను జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్ వి.కర్ణన్ కు నేరుగా కల్సి వివరిస్తామన్నారు.ఈ పర్యటనలో బస్తీ వాసులు మదన్ ,శ్రీధర్,అలోక్‌యాదవ్,శ్రీను ,సంతోష్,రవికుమార్,అభినవ్,రోహిత్ పాల్గొన్నారు.


VAARTHA CLASSIFIEDS

**FOR SALE**

★ 1150 sft apartment for sale @ Malti Naik Plaza Abids 65 lac only, **Call 7416393362 or 9573284811.**

(Ro.No.10165)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**IN THE COURT OF HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II AT :: HYDERABAD.**
**IA No. 1826 OF 2025**
**IN**
**SAIR No. 822 OF 2025**
Between:-
Mr. Thouta Rama Rao, .....**Applicant**
**AND**
1.AP Mahesh Co-op Bank Ltd.,Rep by its Authorized officer and others, .....**Respondents**
**To: Respondent No. 4**
**4. Mr. G Swayam Prakash, S/o G Ambaiah, Aged about 52 years, Occ : Business, R/o H. No. 16-2-836/D/8/1, Madhav Nagar, Saidabad Colony, Hyderabad.**
It is informed to you, that my client above named applicant filed the above IA No.1826 of 2025 IN SAIR No. 822 of 2025 before the Hon'ble Debt's Recovery Tribunal - II, Hyderabad against you and the same was posted on **25.06.2026** and the Hon'ble Tribunal directed to serve the notice to you. This is for your information and notice for your appearance. If you do not appear on that day i.e., **25.06.2026** the matter will be decided on merits.
Hence this Notice
**// BY ORDER OF THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL - II, HYDERABAD //**
Sd/-
**D. RAGHAVULU, ADVOCATE**
H.No. 2-19-55/1, Plot No. 107, Road No. 1, Street No. 8, Kalyanapuri, Uppal, Hyderabad 500013
Cell: 9247362430
Place : Hyderabad
Date : 13.06.2026

**IN COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT : AT : MALKAJGIRI**
**O.S.NO.319OF 2026**
**Between :**
K.Venkateshwarlu S/o. Late K.Pentaiah @ Laxmaiah, Aged about 46 years, Occ: Pvt. Employee, R/o. H.No.4-7-8/104, Bharat Nagar, Kowkoor, Alwal, Medchal-Malkajgiri District - 500 010. ...Plaintiffs
AND
1. The Tahsildar, Malkajgiri.
2. All Concerned .. Defendants
To
All concerned .. Defendant No.2
Whereas the plaintiff has instituted the above suit to declare the Plaintiff as only surviving legal heir of Late Smt. Kanveti Devamma W/o. Late Kanveti Pentaiah @ Laxmaiah, who died intestate on 14-05-2025, consequently entitled to succeed schedule property.
**SCHEDULE OF PROPERTY**
All that House bearing Municipal No.4-7-8/104, Plot bearing No.104, in Sy.No.29, admeasuring 165 Sq.Yds., or 137.9 Sq.Mts., (covered under ward No.4, and Block No.2) situated at Samala Laxmi Enclave, Kowkoor Village, Under GHMC, Alwal Circle, Malakgiri Mandal, Medchal-Malkajgiri District (erstwhile R.R.District) and bounded on: NORTH : Plot No.105; SOUTH : Plot No.103; EAST : Plot No.143; WEST : 25' Wide Road.
You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to suit or who shall be accompanied by some person able to answer all such questions on the23-06-2026, at 10.30 a.m. in the to answer claim and of your defense and to produce on said day all documents in your possession or power upon which you base your defence.
Take notice that in default of your appearance on the day before mentioned the suit will beheard and determined in your absence as exparte.
// BY ORDER OF THE COURT //
D.NAGESHWARI
ADVOCATE
# Flat No.403, 4th Floor Bramareswari Sai Nilayam, Fathullaguda, Bandlaguda, Nagole, M.M.District-068.
Cell: 9849664378
Counsel for Petitioner/Plaintiff

**IN THE COURT OF THE HON'BLEVI ADDLJUNIOR CIVIL JUDGE - CUM-VI ADDL. JMFC RANGA REDDY DISTRICT AT: L.B. NAGAR**
**O.S. No. 80 of 2023**
**Between:**
Canara Bank, L.B. Nagar Branch ...**Plaintiff**
**AND**
Ramavath Swathi ...**Defendant**
To
Ramavath Swathi D/o. Ramavath Baloji, aged about 26 Years, residing at Plot No. 150, Eedaiah Nagar Colony, Boduppal, Telangana - 500 092.
Please take notice that the plaintiff has filed the above suit for Recovery of Money against you before the above court and the said suit is posted to 30.06.2026 for your appearance, incase if you fails to appear before the above court on 30.06.2026, at 10.30 a.m. in person or through Counsel, the matter will be decided as per Law.
**HARI BABU MOVVA, M. Swapna**
**Ruksar Fathima Begum**
ADVOCATES
Flat No.101, A. Block., Badruka Enclave, Road No. 12, Banjara Hills, Hyderabad- 500 034.
**Cell:+91 9640831971**

**PUBLIC NOTICE**
The General Public is hereby informed that my client M/s. Hiranandani Financial Services Private Limited decided to grant loan to Mr. Shaik Pear Alam, S/O Shaik Noor Ahmed, aged about 47 years, Occ: Business, R/O H No 21-3-404/1,Mehaboob Ki Mehandi, Chelapura, Charminar, PO, Hyderabad Jubilee, Hyderabad - 500 002, on his approaching my client with Sale Deed Doc. No. 2478/2022dated 24.11.2022 in respect of Schedule of Property purchased from Afeef Salam Bin Afeef and the document is registered before SRO, Charminar that the property is presently under mortgage with M/s. Aadhar Housing Finance Limited. Afeef Salam Bin Afeef purchased 138 Sq.Yds of said property through Sale Deed Doc. No. 2199/2021 dated 30.08.2021 registered before SRO, Charminar from (1) Laeiqunnisa Abdullah, (2) Zaed Omer Harhara, (3) Sana Omer Harhara, and (4) Huda Omer Harhara who claimed themselves as legal heir's of Late Omer Hussain Harhara died on 14.10.2016 original owner purchased from Nazeer Unnisa Begum through Sale Deed Doc. No. 714/2000 dated 27.02.2000 registered before SRO, Charminar based on notarized Affidavit dated 16.03.2017 but not produced legal heir certificate issued by Govt. Authority i.e., from MRO or from the Court.
Any person/s, Financial Institutions, Banks having right, title, objections or claims in respect of the schedule of property shall submit their claims within 7 days from the date of publication to the undersigned along with documentary proof and no claims shall be entertained thereafter.
**SCHEDULE OF PROPERTY:**
All that the part and parcel of open plot with one room admeasuring 60 Sq.Yds equivalent to 50.168 Sq. Meters, being part of house property bearing Municipal No. 21-3-404/1, situated at Chhilla Mehndi, Mahboob Subhani, Hyderabad , PTIN No. 1052100213, and bounded by: North : By Neighbour's House No. 21-3-404, South : By remaining portion of vendor's property, East : By Lane 6'6" Feet Wide, West : By House No. 21-3-364.
Sd/- Dr. C.S. CHAKRAVARTHYPh.D.(Law)
ADVOCATE
Chamber at Ground Floor, H.No.16-11-16/T/4, "Master's Nilayam", West Prashanth Nagar, Moosarambagh, Hyderabad - 500 036, Telangana State. Cell No. 9391046708, 7901240898, 40-35888927

## గూడ్స్, ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ రంగం అభివృద్ధికి కృషి



డిజిపి సి.వి. ఆనంద్ కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న తెలంగాణ గూడ్స్, ప్యాసింజర్ ట్రాన్స్ పోర్టర్ జేఏసీ చైర్మన్ రామ్ కుమార్ రాటి, అధ్యక్షుడు సయ్యద్ నిజాముద్దీన్, వైస్ చైర్మన్ జగన్నాథ్ రెడ్డి తదితరులు

**మలక్ పేట, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గూడ్స్, ప్యాసింజర్ ట్రాన్స్ పోర్ట్ రంగం అభివృద్ధికి కృషి చేస్తామని తెలంగాణ గూడ్స్, ప్యాసింజర్ ట్రాన్స్ పోర్టర్ జేఏసీ చైర్మన్ రామ్ కుమార్ రాటి, అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, వైస్ చైర్మన్ పి. జగన్నాథ్ రెడ్డి, ఖుర్షిద్ అలీ లు పేర్కొన్నారు. తెలంగాణ గూడ్స్, ప్యాసింజర్ ట్రాన్స్ పోర్టర్ జేఏసీ చైర్మన్ రామ్ కుమార్ రాటి, అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, వైస్ చైర్మన్ పి. జగన్నాథ్ రెడ్డి, ఖుర్షిద్ అలీ తదితరులు తెలంగాణ రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గూడ్స్, ప్యాసింజర్స్ ట్రాన్స్ పోర్టర్ సెక్టర్ లో అందరినీ సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సుమారు 11 అసోసియేషన్లు కలిసి గూడ్స్, ప్యాసింజర్ ట్రాన్స్ పోర్టర్ జేఏసీగా ఏర్పడడం జరిగిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ విభాగం, ట్రాఫిక్ విభాగం, ట్రాన్స్ పోర్ట్ విభాగాలకు అన్ని విధాలుగా సహకరిస్తూ తమ వంతు తోడ్పాటును అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోపాల్ రెడ్డి, సలహాదారులు అజయ్ శర్మ, రామ్ శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు సయ్యద్ ఫయాజ్ అలీ, మహమ్మద్ సలహుద్దీన్, గోవిందరాజు, వివిఎస్ఎన్ మూర్తి, వినీల్ పర్వతనేని, మల్లేశం, శ్రీనివాస్ బాబు, కార్యదర్శి షోయబ్ అలీ ఓమ్ రేజ్, సంయుక్త కార్యదర్శి అనిల్ కుమార్ పాటిల్, మహమ్మద్ సలీం, సోమయ్య, వెంకటేశ్వరరావు, కోశాధికారి గణేష్ యాదవ్, లీగల్ అడ్వైజర్ మదన్ మోహన్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శులు పివి రెడ్డి, సుధాకర్, మీడియా ఇంచార్జి గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ధక్షా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**హయత్ నగర్, జూన్ 13 ప్రభాతవార్త :** హయత్ నగర్ లోని ధక్షా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 14 ఆదివారం రోజున పెద్ద అంబర్ పేట లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాజా మాజీ కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజేందర్ రెడ్డి, యాదాద్రి నగర్ కాలనీ అధ్యక్షులు బద్దం నిరంజన్ రెడ్డి సూచించారు. సాయినగర్ కాలనీ కమ్యూనిటీ హాలులో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని వారు తెలిపారు. బీపీ, షుగర్, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, గైనకాలజీ సంబంధిత పరీక్షలు చేయడంతో పాటు వైద్యులు సలహాలు, సూచనలు అందించ నున్నట్లు తెలిపారు. వివరాలకు 7893146060, 94405 46667, 9490958888 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## బిజెపి యువ మోర్చా ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం



**వనస్థలిపురం జూన్.13,ప్రభాతవార్త.** ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న నమో యువ కాంక్లేవ్" కార్యక్రమానికి సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నమో యువ కాంక్లేవ్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ శ్రీ పొట్లపల్లి సాయిరాం గౌడ్ గారు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ మల్కా యశస్వి గారు మరియు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి చాడ అనితా రెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ మల్కా యశస్వి గారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సుపరిపా లన, అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను యువతకు విస్తృతంగా చేర్చేందుకు నిర్వహిస్తున్న నమో యువ కాంక్లేవ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువత అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, మోదీ ప్రభుత్వం యువత కోసం అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు శ్రీ వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి గారు, బీజేవైఎం డివిజన్ అధ్యక్షులు, ఎల్బీనగర్ నియోజకవర్గ యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమ విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.

## పెన్షనర్స్‌కు డిజిటల్ హెల్త్ కార్డ్స్ జారీ చేయాలి

**: పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్ రెడ్డి**



సమావేశంలో ప్రసంగిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్ రెడ్డి

**మలక్ పేట, జూన్ 13, ప్రభాతవార్త:** పెన్షనర్స్ కు డిజిటల్ హెల్త్ కార్డ్స్ జారీ చేయకుండా కోతలు వద్దని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం భరత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం మలక్‌పేట్ సలీంనగర్ లోని రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం భరత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మారం భరత రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీ చోళా ఓం ప్రకాశ్ యాదవ్ లు మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ హెల్త్ పథకం క్రింద డిజిటల్ హెల్త్ కార్డ్స్ ప్రవేశపెట్టే నిర్ణయం తీసుకున్నందుకు అభినందనలు తెలిపారు. అయితే ఇంతవరకు డిజిటల్ హెల్త్ కార్డ్స్ జారీ చేయలేదని, పథకం అమలుకు మార్గదర్శకాలు కూడా విడుదల కాలేదని తెలిపారు. అయినప్పటికీ జీతాలు, పెన్షన్ల నుండి, భార్యాభర్తలు ఇద్దరి నుండి కూడా చందా కోతలు మొదలుపెట్టడం దారుణమని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డిజిటల్ హెల్త్ కార్డ్స్ జారీ చేసి, పూర్తి మార్గదర్శకాలు విడుదల చేయాలని, కార్డ్స్ , మార్గదర్శకాలు ఇచ్చే వరకు అన్ని కోతలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కోత పెట్టిన మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని పేర్కొన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులు, పెన్షనర్లు అయినా ఒకరి నుండే చందా తీసుకోవాలని కోరారు. తాము పేర్కొన్న డిమాండ్లతో ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయనున్నామని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఓం ప్రకాష్ యాదవ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కలుషితం అవుతున్న మంచినీరు

**-ప్రజల ప్రాణాలతో చెలగాటం**
**-ఫిర్యాదు చేసిన పట్టించుకోని జలమండలి అధికారులు**
**-వర్షాకాలం సమీపిస్తుండడంతో తీవ్రమవుతున్న సమస్య**



కాలనీవాసులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో మురుగునీటి దృశ్యం

**ఎల్.బి.నగర్, జూన్ 13 ప్రభాతవార్త:** జలమండలి అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కలుషితం అవుతున్న మంచినీటి సమస్య గురించి ఎన్నిసార్లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మంచినీరులో డ్రైనేజీ మురుగునీరు కలిసి కలుషితమై విషం చిమ్ముతున్న జలమండలి అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. మంచినీరు కలుషితం కారణంగా గతంలో అనేకమంది నిండు ప్రాణాలు కోల్పోయి నప్పటికీ జలమండలి అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. విధినిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గత అనుభవాలను కూడా పట్టించుకోకపోవడంతో ప్రజలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొంటున్నాయి. కలుషితం నీరు కారణంగా అనేకసార్లు కొంతమంది ప్రాణాలు పోగా మరికొందరు వ్యాధుల బారిన పడి ఆసుపత్రి పాలయ్యారు. సంఘటన జరిగినప్పుడు ఉన్నతాధికారులు సైతం రంగంలోకి దిగి హడావిడి చేసి వెళ్తున్నారే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే విషయంలో మాత్రం అధికారులు నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందించే అధికారులు భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై మాత్రం దృష్టి సారించకపోవడం విచారకరం. ఎల్బీనగర్ జోనల్ పరిధి చైతన్యపురి డివిజన్ మున్సిపల్‌కాలనీలో గత కొన్ని రోజులుగా మంచినీరులో డ్రైనేజీ మురుగునీరు కలుస్తోంది. ఈ విషయమై స్థానికులు జలమండలి అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన కనిపించలేదు. దీంతో కాలనీవాసులు సమస్యపై స్థానిక బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. త్రాగునీరులో మురుగునీరు కలుస్తున్న సమస్య తీవ్రతను గుర్తించిన చంద్రశేఖర్‌రెడ్డి వెంటనే జలమండలి డీజీఎం చందునాయక్, సూపర్‌వైజర్ సురేందర్‌లతో మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సమస్య పరిష్కారం అయ్యే అధికారులపై ఒత్తిడి తీసుకువస్తానన్నారు. మురుగునీరు కలిసి విషం చిమ్ముతున్న త్రాగునీటి సమస్యకు సంబంధించి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని కాలనీవాసులు అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహంకాళి దేవాలయం మాజీ చైర్మన్ పురుషోత్తం, కాలనీ అధ్యక్షులు శ్రీహరి, మల్లేష్, నాయకులు జలంధర్, పులికిరణ్, నరేష్, రాజు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లపై మల్కాజిగిరి పోలీసుల ఉక్కుపాదం..వారం రోజుల్లో మూడు కేసుల ఛేదన

**నేరెడ్ మెట్,మల్కాజిగిరి కమిషనరేట్ , జూన్ 13ప్రభాతవార్త :** మల్కాజిగిరి కమిషనరేట్ సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపారు. జూన్ 7 నుంచి 13వ తేదీ వరకు వారం రోజుల్లో మూడు కీలక సైబర్ మోసాల కేసులను ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, భారీ లాభాలు వచ్చే పెట్టుబడుల పేరుతో, కస్టమర్ కేర్ ప్రతినిధులమంటూ ప్రజలను మోసం చేస్తున్న ముఠాలకు సహకరిస్తున్న మ్యూల్ అకౌంట్ హోల్డర్లను అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కాలంలో ఒక జాబ్ ఫ్రాడ్, ఒక ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఒక ఫేక్ కస్టమర్ కేర్ మోసం కేసును పోలీసులు ఛేదించారు. అలాగే సైబర్ మోసాలకు గురైన బాధితులకు కోర్టు ఆదేశాల మేరకు రూ.50 వేల రీఫండ్ అందజేశారు. ఉద్యోగం పేరు తో మోసంరాండ్‌స్టాడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులమంటూ ఫోన్ చేసిన నిందితులు అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం ఇప్పిస్తామని బాధితుడిని నమ్మించారు. ప్రాసెసింగ్ ఫీజు, ఆఫర్ లెటర్ ఖర్చుల పేరుతో రూ.1.80 లక్షలు వసూలు చేశారు. ఈ కేసులో నిందితులకు బ్యాంకు ఖాతాలు సమకూర్చిన సజ్జల వాసును పోలీసులు అరెస్టు చేశారు. షేర్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో రూ.38 లక్షల టోకరాఅడ్వెంట్‌ఆర్821 గ్రోత్ డిస్కషన్ గ్రూప్ పేరుతో వాట్సాప్ గ్రూప్ నిర్వహించిన సైబర్ నేరగాళ్లు స్టాక్ మార్కెట్ నిపుణులమంటూ బాధితుడిని ఆకర్షించారు. నకిలీ ట్రేడింగ్ యాప్ ద్వారా లాభాలు చూపించి నమ్మకం కల్పించి, వివిధ ఖాతాలకు రూ.38.01 లక్షలు బదిలీ చేయించుకున్నారు. ఈ కేసులో మహ్మద్ జుబేర్‌ను అరెస్టు చేశారు. ట్రేడింగ్ పేరుతో రూ.1.43 కోట్ల మోసంమార్కెట్ యాక్సెస్ ప్రతినిధినంటూ పరిచయం చేసుకున్న మహిళ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో భారీ లాభాలు వస్తాయని నమ్మించి బాధితుడితో 17 లావాదేవీల ద్వారా రూ.1.44 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టించింది. అనంతరం డబ్బు వెనక్కి తీసుకోవాలంటే అదనపు చెల్లింపులు చేయాలని ఒత్తిడి చేయడంతో మోసం వెలుగులోకి వచ్చిం ది. ఈ కేసులో దాడియా శివసాయి అలియాస్ బిట్టును పోలీసులు అరెస్టు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అత్యధిక లాభాలు వస్తాయని హామీ ఇచ్చే వెబ్‌సైట్లు, యాప్‌లు, వాట్సాప్ గ్రూపులను నమ్మవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పరాదన్నారు. మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## చిర్యాల భూవివాదం కేసులో మరో 14 మంది అరెస్ట్.. మరికొందరి కోసం గాలింపు




**మల్కాజిగిరి కమిషనరేట్ (కీసర),జూన్ 13 ప్రభాతవార్త :** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చిర్యాల గ్రామ భూవివాదానికి సంబంధించి నమోదైన హత్యాయత్నం కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఇప్పటికే ప్రధాన నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు, తాజాగా ఈ ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న మరో 14 మంది నిందితులను శనివారం అరెస్టు చేశారు. చిర్యాల గ్రామంలోని సర్వే నంబర్ 156 భూమి వివాదం నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ప్రధాన నిందితులు పల్లె భద్రరెడ్డి, బొల్లంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పంజా సంజయ్ కుమార్‌లను ఈ నెల 7న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తదుపరి దర్యాప్తులో భాగంగా ఘటనలో పాల్గొన్న మరో 14 మంది నిందితుల పాత్రను పోలీసులు నిర్ధారించి అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, భూమి వివాదానికి సంబంధించి నిందితులంతా గుంపుగా చిర్యాల గ్రామంలోని వివాదాస్పద స్థలం వద్దకు చేరుకుని, అక్కడ విధులు నిర్వహిస్తున్న వాచ్‌మన్ గోదుగు సాయికుమార్‌పై దాడి చేశారు. అతడిని రక్షించేందుకు వచ్చిన బాధితులు, ప్రత్యక్ష సాక్షులపై కూడా ఇనుప రాడ్లు, హ్యామర్లు, కర్రలు, రాళ్లతో దాడి చేసి తీవ్ర గాయాలకు గురిచేసినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన బాధితుల వాంగ్మూలాలు, ప్రత్యక్ష సాక్షుల ప్రకటనలు, ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల ప్రమేయాన్ని గుర్తించిన ప్రత్యేక బృందాలు వారిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, దర్యాప్తు అధికారి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేసి కేసును ఛేదించారని, వారి సేవలను డీసీపీ సి.హెచ్. శ్రీధర్ అభినందించారు. ఈ కేసులో ఇంకా మరికొంత మంది నిందితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. భూవివాదాల్లో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దుభూమి లేదా ఇతర సివిల్ వివాదాలను కోర్టులు, రెవెన్యూ శాఖల ద్వారా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. భూవివాదాల్లో రౌడీ మూకలను ఆశ్రయించడం, ప్రత్యర్థులపై దాడులకు పాల్పడడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డబ్బు ఆశతో ఇటువంటి ఘటనల్లో పాల్గొనే వ్యక్తులు జైలుశిక్షతో పాటు రౌడీషీట్ నమోదయ్యే పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## చింతలకుంట అండర్‌పాస్‌కు మరమ్మతులు చేపట్టాలి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



చింతలకుంట అండర్ పాస్ వద్ద ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం జూన్.13.ప్రభాతవార్త.** చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు మరమ్మత్తు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి - ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డిచింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతుండటంపై ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న పనులను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎల్.బి.నగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏం.ఏం.సి.ప్రాజెక్ట్ ఈ.ఈ. రోహిణితో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, దాదాపు రెండున్నర నెలల క్రితం ప్రారంభమైన రోడ్డు మరమ్మత్తు పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పనులు ఆలస్యం కావడం వల్ల హయత్‌నగర్, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. యూటర్న్ కోసం ఎల్.బి.నగర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ప్రయాణ సమయం పెరగడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు కూడా అధికమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు రేయింబవళ్లు పనిచేసి చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేసి వచ్చే పది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ వర్క్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో బండారు శ్రీవాణి బేటి



**రామంతాపూర్, జూన్ 13 ప్రభాతవార్త :** దుండిగల్‌లోని ఎయిర్ ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను శనివారం రామంతాపూర్ మాజీ కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, రాజ్యలక్ష్మి,సునీత యాదవ్, శేషగిరి రావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి రాజ్‌నాద్‌సింగ్ దేశ రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. దేశ రక్షణకు అంకిత భావంతో సేవలందిస్తున్న భారత వాయుసేన అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలే ప్రాణ రక్షణకు కవచం

**నేరెడ్‌మెట్, మల్కాజిగిరి కమిషనరేట్ , జూన్ 13 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ట్రిముల్గెర్రీ ట్రాఫిక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. శంకర్ రాజు సూచించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “అరైవ్ అలైవ్“ కార్యక్రమంలో భాగంగా శనివారం బేగంపేట్‌లోని టాటా మోటార్స్ సంస్థ సిబ్బందికి ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, ట్రాఫిక్1 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా తమతో పాటు ఇతర రహదారి వినియోగదారుల ప్రాణాలను ఎలా కాపాడవచ్చో వివరించారు. ఏసీపీ జి. శంకర్ రాజు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను క్రమశిక్షణతో పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, విలువైన ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రిముల్గెర్రీ ట్రాఫిక్ అదనపు ఇన్‌స్పెక్టర్ పి. రమణయ్య, టాటా మోటార్స్ బేగంపేట్ మేనేజర్ ఎం.డి. సాదిక్, బేగంపేట్ పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్రాభివృద్ధి : బిజెపి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్

**సైదాబాద్, జూన్ 13 ప్రభాతవార్త:** బిజెపి భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్ ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ డివిజన్ వినయ్ నగర్ కాలనీలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలలో తెలంగాణాకు లక్షల కోట్ల రూపాయల నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, విద్యా సంస్థలు, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, గత 12 సంవత్సరాలలో మన దేశం డిజిటల్ సేవలు, మౌలిక సదుపాయాలు, జాతీయ భద్రత, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల దిశగా గణనీయమైన పురోగతి సాధించడం జరిగిందన్నారు. మోది ప్రభుత్వ విజయాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సమావేశాలు నిర్వహిస్తునామని వారు పేర్కొన్నారు. ప్రధాని మోది కేంద్రంలో 12 ఏళ్ల సుపరిపాలన, అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి 2028లో తెలంగాణాలో బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ జండా ఎగురవేస్తామని బిజెపి నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ కుమార్, సీనియర్ సిటిజన్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సుభాష్ చందర్ జీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, వీరేందర్ బాబు, జంగం మధుకర్‌రెడ్డి, నాయకులు ఉగాది మహేష్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : గోపాల్ ముదిరాజ్



డ్రైనేజీ క్లీనింగ్ పనులు పర్యవేక్షిస్తున్న కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్

**సైదాబాద్, జూన్ 13 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ మాధవనగర్ కాలనీ రోడ్డు నెం.2,6,7,8లలో డ్రైనేజీ పొంగి పొర్లుతుండడంతో కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి, సిబ్బందిని రప్పించి గల్పర్‌తో సమస్యను పరిష్కరింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఖబరస్తాన్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఖబరస్తాన్ కమిటి నేతలు

**ఉప్పల్, జూన్ 13 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ లోని ఉస్మానియా యూనివర్సిటి ఖబరస్తాన్ కమిటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, కాలేరు జై నవీన్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఓయులోని ఖబరస్తాన్ ఆధునీకరణ, నీటి సౌకర్యం వీధి దీపాల ఏర్పాటు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖబరస్తాన్ అధ్యక్షుడు ఎండి జహురుద్దీన్, ఉపాధ్యక్షుడు యాకూబ్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఎం డి రఫిక్, కార్యనిర్వహణ సభ్యుడు ఎండి హుస్సేన్ పాషా, ఖాజా కుతుబుద్దీన్, షేక్ కైసర్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.రెండున్నర కోట్లతో అభివృద్ధి పనులు : ఎం.రజితరెడ్డి



ఉప్పల్ కురుమనగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 13 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ కురుమనగర్, ఉప్పల్ హిల్స్‌లో రూ.2.50 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం మాజీ కార్పొరేటర్ మందముల రజితరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాలనీలో రూ.79 లక్షలతో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ, రూ.1 కోటి 72 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇటీవల కాలనీల్లో పర్యటించిన సందర్భంగా స్థానికులు కోరిన వెంటనే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఉప్పల్ డివిజన్ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిలవకుండా డ్రైనేజీ, గుంతలు లేని రోడ్ల కోసమే నిధులు వెచ్చిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నేతలు దుర్గం నవీన్ యాదవ్, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, గోవింద్ కుమార్ స్వామి, పి.రామచందర్, గోవిందు, టి. మల్లేష్, ఎం.సుధాకర్ రెడ్డి, అక్కు రవి, టి. శ్రీనివాస్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, పెంచలయ్య, సుబ్బారెడ్డి, సంధ్య, రాజయ్య గౌడ్, రాజు, నరేందర్, నాంపల్లి వెంకన్న, సిహెచ్ రమేష్, పి.నరేష్, సాయి, వెంకటేష్, సంపత్, రాజు, హరీష్, ఉపేందర్, ఎస్. రామస్వామి,ఎం.రాములు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మంచి పౌరులుగా తయారు కావాలి



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 13 ప్రభాతవార్త:** విద్యార్థులు ఎలాంటి వ్యసనాలకు అలవాటు కాకుండా చక్కగా విద్యాభ్యాసం చేసి భావి భారత పౌరులుగా తయారు కావాలని ఆదిభట్ల ఏసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాలాపూర్ మండలంలోని అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌లో నూతనంగా ఏర్పాటైన ఓ ప్రైవేటు పాఠశాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లు, టివిలకు బానిసలు కావద్దని ఆయన సూచించారు. అంతకు ముందు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ శోభన్, సామాజిక కార్యకర్త లెంకల అశోక్‌రెడ్డి, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి




సమ్మేళనం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

**సరూర్‌నగర్, జూన్ 13 ప్రభాతవార్త:** ఈ నెల 16, 17 తేదీల్లో కొత్తపేట్‌లోని బిజెఆర్ భవన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ రాష్ట్ర యువజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా నాయకుడు, బాలాపూర్ మండల పార్టీ ఇంఛార్జి గొరెంకల నర్సింహ పిలుపునిచ్చారు. శనివారం బడంగ్‌పేట్‌లోని బాలాపూర్ ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ సమ్మేళనానికి పార్టీ అగ్ర నేతలు బివి రాఘవులు, తమ్మినేని వీరభద్రం, జాన్ వెస్లీ, ఎఎ రహీమ్ తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మేరకు పెద్ద సంఖ్యలో యువత హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి బాబు, సుంకోజు యాదగిరిచారి, నీలం వెంకయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి : మధుకర్



బీఆర్ఎస్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న గెండెల్లి మధుకర్

**తార్నాక, జూన్ 13 ప్రభాతవార్త :** ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, దానిని సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండెల్లి మధుకర్ అన్నారు. తార్నాక డివిజన్ పరిధిలో ఉన్న 195, 199, 201 బూత్‌ల పరిధిలోని ఓటర్లు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. తార్నాక సండే మార్కెట్ వేదికగా నిర్వహించనున్న జన జాతర కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా అర్హత సాధించిన వారు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు, పేర్లు, చిరునామాలు లేదా ఇతర వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే వెంటనే సవరించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకమని, ఓటరు జాబితాలో పేరు నిర్ధారణ చేసుకోవడం ద్వారా రేపటి ప్రగతికి బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జింకల మల్లేష్, శ్యామ్, సాయి, రాకేష్, నాగేష్, యాదగిరి పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాను పరిశీలించి సవరణలు చేసుకోవాలి



ఇంటింటికి బీఆర్ఎస్ పత్రాలను పంపిణీ చేస్తూ మాట్లాడుతున్న మాజీ కార్పోరేటర్ సరస్వతి

**తార్నాక, జూన్ 13 ప్రభాతవార్త :** తార్నాక డివిజన్ పరిధిలో ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని బీఆర్ఎస్ నాయకురాలు, తార్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి పిలుపునిచ్చారు. కొత్తగా అర్హత సాధించిన వారు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు, జాబితాలో ఉన్న పొరపాట్లను సరిచేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె శనివారం డివిజన్‌లో ఇంటింటికి తిరుగుతూ ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా ఓటర్ల జాబితాలో తమ పేరు నమోదై ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఒర్సు కృష్ణ, ఆలకుంట అరుణ్‌కుమార్, విష్ణు, జానకిరామ్, వేముల కిట్టు, ఎస్. కోటేష్, కేజీ శ్రీనివాస్, గండికోట చంద్ర, జింక రవి, జ్యోతి, ఆలకుంట కుమార్, టమాటా శ్రీనివాస్, పెద్ద ముత్యాలు, ఆలకుంట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 30 నుంచి శ్రీసత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు



**ఎల్.బి.నగర్, జూన్ 13 ప్రభాతవార్త:** గడ్డిఅన్నవరం క్షేత్రం శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 30వ తేదీ నుండి జూలై 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయం ప్రతినిధులు తెలిపారు. దేవాలయం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శనివారం దేవాలయం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు రోజులపాటు దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు హోమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేవరం లింగారెడ్డి, జనరల్ సెక్రటరీ చకిలం రమణయ్య, కోశాధికారి వక్కలంక శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులు పాల్థి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ భాష పాక సంతోష్ కుమార్, సభ్యులు కె.ఎన్.రావు, మాజీ చైర్మన్లు బచ్చు సత్యనారాయణ, ప్రొద్దుటూరి కుమారస్వామి పాల్గొన్నారు.